## సైబీరియన్ కొంగల సందడి



నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచ గ్రామం పాత చెరువు ఆనుకుని ఉన్న వ్యవసాయ పాలంలో సోమవారం సైబీరియన్ కొంగలు సందడి చేశాయి. రైతులు ట్రాక్టర్‌తో దమ్ము చేస్తుండగా, భూమిలో నుంచి బయటకు వచ్చే పురుగులను తినడానికి కొంగలు పరుగులు తీస్తూ కనువిందు చేశాయి. - నర్సింహులపేట




వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య, పక్కన సూపరింటెండెంట్, సిబ్బంది

# కొవిడ్ రోగులకు 100 బెడ్లు

- ప్రభుత్వ ఆదేశాలతో ములుగు దవాఖానలో ఏర్పాటు
- డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య

ములుగురూరల్, డిసెంబర్ 21 : కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో 100 బెడ్లను అందుబాటులో ఉంచనున్నట్లు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య తెలిపారు. గురువారం ఆయన దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్‌తో కలిసి దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ 2020-2001లో కొవిడ్ ఉద్రిక్తంగా ఉన్నప్పుడు 100 బెడ్లతో వైద్యం అందించామన్నారు. ప్రస్తుతం అదే స్థాయిలో బెడ్లను ఉంచనున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది సైతం అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని సూచించారు.

కేసులు పెరిగితే ముందస్తు చర్యలో భాగంగా వార్డులో ఆక్సిజన్ సప్లై, కాన్సెంట్రేట్ పీఎస్‌ఏ ప్లాంట్‌లతో బెడ్లను ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం దవాఖానలో ఐసొలేషన్ వార్డును గుర్తించారు.



మల్లారెడ్డి గ్రామంలో యాసంగి సాగు కోసం పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు



ఎడ్లబండిలో వరిగడ్డిని తీసుకెళ్తున్న రైతు

# అన్నదాతలు బిజీబిజీ



వరికోస్తున్న హార్వెస్టర్



ధాన్యాన్ని బస్తాల్లోకి నింపుతున్న కూలీలు

- మొదలైన యాసంగి పనులు
- ఇళ్లకు చేరుతున్న వానకాలం ధాన్యం
- పుట్లకొద్దీ వడ్ల రాశులతో పల్లెల్లో కళకళ

కొత్తపాతల మేళ వింపు పనులతో అన్నదాతలు బిజీబిజీగా ఉన్నారు. ఒకపక్క వానకాలం పంట ఉత్పత్తులు ఇళ్లకు చేరుతుండగా, మరోపక్క యాసంగి సాగు కోసం సన్నద్ధమవుతున్నారు. వరినార్లు పోసుకోవడంతోపాటు పొలాలకు నీళ్లు పెట్టి నానబెడుతున్నారు. వరికొయ్యలను మురిగించి కలియదున్నుతున్నారు. ట్రాక్టర్లతో దమ్ముకొడుతూ వరినాట్లకు పొలంమడులను సిద్ధం చేస్తున్నారు. ఇక వానకాలంకు సంబంధించి దాదాపుగా వరికోతలు ముగిశాయి. కొందరు రైతులు ధాన్యాన్ని కల్లాలు, రోడ్లకు ఇరువైపులా ఆరబెట్టుకోగా, మరికొందరు బస్తాల్లో నింపుకొని సంతోషంగా తీసుకెళ్తున్నారు. పుట్ల కొద్దీపండిన వడ్ల రాశులతో పల్లెలు పునీతమవుతుండగా, ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఇండ్లకు చేరుతుండడంతో కర్షకులు మురిసిపోతున్నారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



పెగడపల్లిలో ఆరబోసిన వడ్లు



బైరాన్‌పల్లి గ్రామంలో వరి నారు చుట్టు వళ కంచె



# ఎంజీఎంలో కరోనా కలకలం

- సామాజిక మాధ్యమాల్లో వైరల్
- అవాస్తవమని తేల్చిన వైద్యాధికారులు
- దవాఖానలో నో మాస్క్ నో ఎంట్రీ నిబంధనలు అమలు

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 21 : వరంగల్ ఎంజీఎం దవాఖానలో కరోనా కేసు నమోదు అయిందన్న పుకారు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో గతంలో కరోనా మోగించిన మృత్యు ఘంటికలను గుర్తు చేసుకుంటూ రోగులు, అటెండెంట్లు భయాందోళనలకు గురయ్యారు. భూపాలపల్లి జిల్లాకు చెందిన 61ఏళ్ల మహిళ కరోనా లక్షణాలతో ఎంజీఎం కొవిడ్ వార్డులో చేరిందని, నగరానికి చెందిన మరో ఆరుగురు వ్యక్తుల నుంచి కూడా నమూనాలు సేకరించి కొవిడ్ పరీక్షలు నిర్వహించడానికి వైద్యాధికారులు హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించినట్లు వాట్సాప్‌లో తప్పుడు వార్తలు సర్క్యులేట్ అయ్యాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు ఇప్పటి వరకు దవాఖానకు కరోనా జేఎన్-1 లక్షణాలు ఉన్న రోగులు రాలేదని స్పష్టం చేశారు. అనుమానితురాలిగా గుర్తించిన మహిళకు సారి (ఎస్‌ఏఆర్‌ఐ)వార్డులో ప్రత్యేక వైద్య చికిత్స అందిస్తున్నామని, శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న ఆరుగురు వ్యక్తులకు సైతం నమూనాలు సేకరించి కాకతీయ మెడికల్ కళాశాలలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపించామని, రిపోర్టు ఆధారంగా చికిత్స చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు పాజిటివ్ కేసులను గుర్తించలేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతానికి 50 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశామని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. అలాగే హాస్పిటల్‌లో మాస్క్‌ను తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## ఎస్సార్ ఎడ్యు సెంటర్ ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 21 : జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్, నీట్‌లో 50 సంవత్సరాల అనుభవం ఉన్న ఎస్సార్ ఎడ్యు సెంటర్ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో చేరే విద్యార్థులకు ఈ నెల 24న హనుమకొండ వడ్డేపల్లిలోని ఎస్సార్ ఎడ్యుసెంటర్‌లో ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ ఏ వరదారెడ్డి తెలిపారు. అర్హులైన విద్యార్థులకు వంద శాతం స్కాలర్‌షిప్ పొందే అవకాశం కల్పిస్తున్నామని, పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి సాల్కర్‌షిప్ పొందే అవకాశం ఉందన్నారు. పటిష్టమైన ప్రణాళికలతో హైస్కూల్, జూనియర్ కాలేజీ, ఎంసెట్, ఐఐటీ, నీట్ విద్యనందిస్తున్నామని, ఈ సంవత్సరం ఐపీఈలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు, జేఈఈ(మెయిన్), జేఈఈ(అడ్వాన్స్‌డ్), నీట్-23లో జాతీయస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్‌లో పాల్గొనే విద్యార్థులు 9642117830, 9642117330 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# వైద్య విధానంలో విప్లవాత్మక మార్పులు




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అరుణా విశ్వనాథ్ వాణికర్

- అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు ప్రెసిడెంట్ డాక్టర్ అరుణా విశ్వనాథ్ వాణికర్
- కేఎంసీలో రీజినల్ సెంటర్ షురూ
- ప్రారంభించిన నేషనల్ మెడికల్ కమిషన్ ప్రతినిధులు
- అందుబాటులోకి రానున్న అధునాతన సాంకేతికత

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 21 : ప్రపంచవ్యాప్తంగా వైద్య విధానంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు ప్రెసిడెంట్ డాక్టర్ అరుణా విశ్వనాథ్ వాణికర్, సభ్యుడు డాక్టర్ విజయేంద్రకుమార్ అన్నారు. కాకతీయ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ రీజినల్ సెంటర్‌ను గురువారం మెడికల్ కమిషన్ ప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం కేఎంసీ ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆధునిక యుగంలో వైద్యరంగంలో చాలా మార్పులు వచ్చాయని, వాటిపై విద్యాబోధకులకు సైతం అవగాహన ఉండాలన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ మెడికల్ కళాశాల, భాస్కర మెడికల్ కళాశాలల్లో మాత్రమే అందుబాటులో ఉన్న టెక్నాలజీ రీజినల్ సెంటర్ ఇప్పుడు వరంగల్ కేఎంసీలో అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కేంద్రానికి ముందుగా ఆరు నెలల కాలవ్యవధితో అనుమతులు అందిస్తారని, నిర్వహణ తీరును పరిశీలించి పూర్తిస్థాయి అనుమతులు మంజూరు చేస్తారని వెల్లడించారు. ఈ రీజినల్ సెంటర్ పరిధిలో 12 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశామన్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ విధానంలోని ఫ్యామిలీ అకాడమీ ప్రోగ్రాం (ఎఫ్‌ఏపీ)ని అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించేందుకు బుధవారం ఆత్మకూరు గ్రామాన్ని సందర్శించామని వివరించారు. కార్యక్రమంలో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, భాస్కర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలం, మహాత్మాగాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఎన్ రెడ్డి, ఎంజీఎం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, కేఎంసీ మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## జగదీశ్వర్ సోదరుడికి గుండెపోటు

### ఆరు నెలల వ్యవధిలో ఇద్దరు అన్నదమ్ములు మృతి



కుసుమ జయప్రకాష్(ఫైల్)

ములుగురూరల్, డిసెంబర్ 21 : ములుగు జడ్పీ మాజీ చైర్మన్ దివంగత కుసుమ జగదీశ్వర్ సోదరుడు కుసుమ జయప్రకాశ్ (50) గుండెపోటుతో మృతి చెందాడు. మల్లంపల్లి గ్రామానికి చెందిన జయప్రకాశ్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం గుండెపోటుకు గురికాగా కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన మల్లంపల్లికి తరలించగా గురువారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో పాటు ఆయన అభిమానులు మల్లంపల్లికి చేరుకొని భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఆరు నెలల వ్యవధిలో ఇద్దరు..**

ములుగు జడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్న క్రమంలో జగదీశ్వర్ జూన్‌లో గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఆరు నెలలు గడువకముందే ఆయన సోదరుడు జయప్రకాశ్ సైతం గుండెపోటుతో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## లక్ష్మీ బరాజ్‌లో మరమ్మతులు

మహదేవపూర్, డిసెంబర్ 21 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని లక్ష్మీ బరాజ్‌లో కుంగిన పిల్లర్లకు మరమ్మతులను ఎల్ అండ్ టీ సంస్థ నవంబర్‌లో ప్రారంభించింది. బరాజ్‌లోని 19, 20, 21వ పిల్లర్లకు మరమ్మతుల కారణంగా మొదట నీటి మళ్లింపు పనులు పూర్తి చేసినట్లు తెలిసింది. యంత్రాలు, మెటీరియల్ తరలింపు కోసం వీలుగా బరాజ్ పైభాగం నుంచి కింది వరకు కాపర్ డ్యాం (550 మీటర్ల పొడవు ) పనులు కొనసాగుతున్నాయి. ఇవి పూర్తయితే పిల్లర్ల మరమ్మతులు సులువవుతాయి.





ఉదయం ఎనిమిది గంటకు లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనం


# మంచు తెర

ఓ వైపు పొగమంచు.. మరోవైపు ఎముకలు కొరికే చలితో ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలైనా వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించారు. ఈ దృశ్యాలు మంగపేట మండలం కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం గ్రామాల్లో కనిపించాయి. మరోవైపు సూర్యుడు సైతం చందమామలా తెల్లగా కనిపిస్తూ చూపరులను కనువిందు చేశాడు.

- మంగపేట, డిసెంబర్ 21



చందమామలా తెల్లగా కనిపిస్తున్న సూర్యుడు



తొమ్మిది గంటలైనా వీడని మంచు తెర